# దేశ భాషలందు తెలుగు "లెస్"

"యస్టర్ డే ఈవినింగ్ మీ ఇంటికొచ్చేం, నేనూ మా మిసెస్సున్నూ. ఏం పెద్ద పర్పజ్ లేదనుకో, ఊరికే కట్లెసీకాల్ షాపింగ్కని బైల్దేరి మీ హౌస్ ఆన్ ద వే కదాఅని ఓసారి హౌడుయుడూ అందామని డ్రాపయ్యేమన్నమాట. మీ డోర్ లాక్ చేసుంది. మీ నైబర్స్ని యంక్వైర్ చేస్తే పిక్చర్ కెళ్ళేరన్నారు!" అని చెప్పేడు విశ్వనాథం, ఆ మధ్య ఓనాడు నన్ను కలుసుకుని.

విశ్వనాథం కాన్వెంట్లో చదవలేదు. వాళ్ళ పిల్లలిద్దర్నీ కాన్వెంట్లోనే చదివిస్తున్నాడు! అది వేరేసంగతి.

అప్పుడెప్పుడో ఈ విశాఖపట్నంలోనే మేం యిద్దరం ఎమ్మే (తెలుగే) చదివేము. టర్నర్ సత్రం పక్కసందులో నిష్ఠలవారింట్లో ఓ గది అద్దెకి తీసుకొని వుండేవాళ్ళం. మా సందుచివర ఓ పూటకూళ్ళ యిల్లుండేది. దానికి "శ్రీకృష్ణా విలాస్" బ్రాహ్మణ భోజన హోటల్ అనో; "వసంత విహార్" విజిటేరియన్ మీల్స్ హోటల్ అనో బోర్డు పెట్టలేదు.

ఓం నమోనారాయణ శాకాహార భోజనశాల. నిర్వహణ ఆకెళ్ళ మల్లిఖార్జునశాస్త్రి అని పెట్టారు బోర్డు. భోజనం సిద్ధంగావుండే వేళలు: 'ఉదయం తొమ్మిది గంటలనుంచి పన్నెండువరకు, రాత్రి ఏడున్నర నుంచి తొమ్మిదివరకు' అని వేరే అట్టమీద వ్రాసి ఆవేళలప్పుడు బైట పెట్టేవారు.

"ఏమండీ, మీల్సుందా?" అని అడిగితే;

"మీల్సా? లేదు బాబూ" అని చెప్పేసేవాడు శాస్త్రిగారు అక్కడ కూర్చుని.

"మరి వాళ్ళంతా చేస్తున్నారు కదండి" అంటే.

"వాళ్ళా? 'మీల్సు' చెయ్యడంలేదే; భోజనాలు చేస్తున్నారంతే" అని జవాబు.

మల్లిఖార్జునశాస్త్రిగారి సంగతి తెలిసిన వాళ్లు నిశ్శబ్దంగా లోపలి కెళ్ళి ఖాళీగా వుండే పీట చూసుకుని (టేబిళ్ళూ కుర్చీలూ వుండేవి కాదు) కూర్చుని అక్కడున్న దాంతో తమకు కావలసిన విధంగా భోజనం

చేసి డబ్బు ఇచ్చి వెళ్ళేవారు. మధ్యలో 'రైస్ వెయ్యండి' అనో, 'రసం యివ్వండి' అనో అంటే పడ్డాయన్నమాటే చివాట్లు. పై కారణం గానే ఇంగ్లీషు ఎమ్మే చదువుదామని వొచ్చి దాంట్లో సీటు దొరక్క తెలుగు చదివిన విశ్వనాధానికి; అక్కడ గట్టిగా మూడు పూటలు భోజనం చేసే యోగ్యత కలగలేదు. ఆ విధంగా అతనూ నేనూ వున్నది ఒకచోటే అయినా తిన్నది వేరేచోట అయింది.

ఎమ్మే చదివినా సర్వీస్ కమీషన్‌కి వెళ్ళి గవర్న మెంట్ ఉద్యోగంలో చేరిన విశ్వనాధం, తెలుగు లెక్చరర్‌గా స్థిరపడిన నేనూ, మళ్ళీ పదేళ్ళ తరువాత విశాఖపట్నంలో కలవడం, చివరికి ఇరుగు పొరుగు వాటాల్లోనే కాపరాలకి చేరడం జరిగింది.

మొన్న మూడురోజులనాడు కుటుంబాన్ని వాళ్ళ మామగారింట్లో దిగబెట్టి ఈ ఉదయం దిగాడు.

"ఆయన్ని భోజనానికి ఈ పూట కిక్కడే వుండమనండి. ప్రయాణం చేసొచ్చేరేమో పాపం, ఈ అడావిళ్ళో ఏం వండుకుంటాడు. పదింటికి కొలువుకి వెళ్ళాలికూడా గావును." అంది మా ఆవిడ.

రిక్షా దిగి తాళంచెవి తీసుకోవడానికి రాగానే చెప్పాను. మా ఆవిడ కూడా వుంది. "ప్రయాణం సౌకర్యంగా జరిగిందండీ? ఒదిన గారూ పిల్లలు క్షేమమేనా?" అంటూ తన ధోరణిలో అడిగింది.

"అంతా ఓకే అండీ. లంచ్‌కి ఇన్వైట్ చేసినందుకు థాంక్సండీ! అందులో అసలే రాత్రంతా యేం తిన్లేదు" అన్నాడు విశ్వనాధం నవ్వుతూ.

"భోజనం చేసి బైల్దేరడానికి ఎడం లేదు గావును, పాపం" అంది మా ఆవిడ.

"గోదావరీ కదండీ, ట్రెయిన్ టైమేమో సెవెన్ ఫిఫ్టీన్‌కి. అఫ్ కోర్స్! ఏదో బ్రీఫ్‌గా మీల్స్ అయిందనిపించొచ్చు. నైట్ జర్నీ కదండి, సడన్‌గా ప్రోగ్రాం అనేసరికి రిజర్వేషన్ ప్రాబ్లెం కదా. అంచేత బాగా ఎర్లీగా- అంటే ఫైవ్ తర్టీకే- స్టేషన్ చేరి కొంచెం పైరవీ చేసేసరికి అయిపోయింది టైమంతానూ. బెర్త్ ఓకే అయ్యే సరికింకా త్రీ మినిట్స్ మిగిలింది టైం; డిపార్చర్‌కి.

నేను ఎప్పట్లా విశ్వనాథం భాష వింటూ కులాసా చేసుకుంటు న్నాను.

"పోనీ ప్రయాణం మధ్యలో ఎక్కడో దిగి భోంచెయ్యవలసింది" అంది మా ఆవిడ.

"కాజీపేట- మీల్స్- అంటూ టికెట్స్ అమ్మేరుగానండీ! మరీ లేటవర్ అయిపోతుందేమోనని పర్చేజ్ చెయ్యలేదండి. పైగా వాళ్ళు సర్వ్‌చేసే ఫుడ్ అంత స్టాండర్డ్‌గా వుండదండి, రైల్వే మీల్స్‌కదా!"

"పోనీ, ఏదో ఫలహారం చెయ్యవలసింది; రొట్టో, అరిటిపళ్ళో- మరీ కటిక ఉపవాసం కాకుండా వుండేది."

"బ్రెడ్ అమ్మేరు గానండీ. మరీ డ్రైగా ఎలా తినేది? బటరూ లేదు జామూలేదు. పైగా నాకు టోస్ట్ అయితే తప్ప బ్రెడ్ నచ్చదండి."

"అరటిపళ్ళూ దొరకలేదుటండీ. చిత్రం?"

"కేలా తెచ్చేరు గానండీ వెండర్సు; అవీ నేను లైక్ చెయ్య లేదండి, మనవేపైతే ముక్రీలూ, చక్కెర కేళీలూ వుంటాయి. అక్క డంతా గ్రీన్ ప్లాంటెన్, పైగా డాటెడ్ స్టఫ్.... డైజస్ట్ అవదని——"

"పాపం! ఇంకేం దొరకనే లేదన్నమాట తింటానికి!"

"ట్రెయిన్లో యేం దొరుకుతాయి? మూంపల్లి, కాజు!"

"అవేమిటండోయ్?"

నేను మా ఆవిణ్ణి కోప్పడ్డాను. "మూంపల్లి అంటే వేరుసెనగ గింజలు, కాజు అంటే జీడిపప్పు. ఆ మాత్రం తెలీదు?"

"నా కెలా తెలుస్తాయి? ఏ రైల్లోనైనా ఎక్కడికైనా తీసికెళ్ళడ మంటూ వుంటే కదా-" అని మా ఆవిడ తిరగబడింది.

"గ్రౌండ్‌నట్సు, కాజ్యూ- ఇవి ఫుడ్డేంటండి? ఏదో శ్నాక్స్‌గా అయితే అఫ్‌కోర్స్! వుయ్‌కెన్ బేర్ విత్ సచ్‌తింగ్స్."

"సర్లెండి. ఇప్పటికే తొమ్మిది కావస్తోంది, వేగిరం స్నానం చేసిరండి. భోంచేద్దురుగాని" అని మా ఆవిడ లోపలి కెళ్ళింది.

"ఫైవ్ మినిట్స్!" అని చిటికె వేసేడు విశ్వనాథం, పళ్ళు బ్రష్ చేసుకుని షేవూ బాత్తూ- త్రి- ఇన్- వన్!

* * *

"అబ్బో, అబ్బో! జస్ట్ ఫిఫ్టీన్ మినిట్స్ నోటీస్‌లో ఇంత ప్రొఫ్యూజ్ లంచ్ ప్రిపేర్ చేసేస్రే! ఏమీ ఇలా బొరేట్ అరేంజ్ మేట్సండీ బాబూ! హేట్సాఫ్! రైసు, డాలు, చట్నీ, కర్రీలు, రెండు, సాంబారు, రసం,కర్డు;పైగా స్పెషలొకటి. ఓహో!" అని మాయాబజార్ సినిమాలో శాస్త్రీ, శర్మ పడ్డ ఆశ్చర్యాన్ని గుర్తుతెచ్చాడు విశ్వనాథం.

మా ఆవిడ, చేతిలో వున్న గరిటె అక్కడ పడేసి వంటింట్లోంచి గదిలోకి వెళ్ళిపోయింది. ఎంత పొందికగా పడేసినా ఆ గరిటె పడడంలో వొచ్చిన చప్పుడు ఆ విసుగుని నాకు తెలియపరచింది. నేను వెనకాలే వెళ్ళాను కొంచెం సముదాయించే ఉద్దేశంతో.

"నా వల్లకాదు, మీరే వడ్డించుకోండి."

"అదికాదు, ఇంతా చేసి-" అన్నానో లేదో నా మీద విరుచుకు పడింది.

"ఆయనగారు ఆంధ్రదేశపు రాజధాని హైద్రాబాద్ నుంచి బయల్దేరి మరో రాష్ట్రపు పొలిమేరకైనా వెళ్ళని గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో వచ్చేరండీ. సరే; ఆ 'గోదావరీ'లో 'మీల్స్', 'కాజు', 'మూంపల్లి', 'కేలా' బ్రెడ్డూ తినలేక పోయేరండీ. ఇంటికొచ్చి గూడా లక్షణంగా అన్నం, పప్పు, పచ్చడి, కూరలు, పులుసు, చారు, పెరుగు పాయసం సిద్ధంచేసిపెడితే రైసుట, డాల్‌ట, చట్నీట, కర్రీట, సాంబార్‌ట, రసంట, కర్డ్‌ట, స్పెషలట, నా పిండా కూడుట, నేనా భాష విన్లేను. ఇద్దరూ గంగలో దూకండి" అని కుర్చీమీద చతికిల పడిపోయింది మా ఆవిడ.

నేను నిస్పృహాయంగా లోపలికెళ్ళి "మనమే వొడ్డించేసుకుందా మోయ్! మా ఆవిడకి వొంట్లో-" అని నసిగాను.

"ఓకే. ఓకే! ఇట్సాల్‌రైట్! లేడీస్ కదా, వాళ్ళకి మన్లా ఎలాగ? మంత్లీ ట్రబుల్ గావును. ఇంకా నయం, అంతా రెడీ అయింది. వుయ్‌షుడ్ కంగ్రాచులేట్ అవర్ సెల్వ్స్. లేకపోతే పెద్ద హెల్లయి పోయేది!"

మా ఆవిడ అక్కడ పడేసిన గరిటకేసి తీక్షణంగా చూశాను. "దీంతో వొడ్డించాలి వీడికి" అనిపించింది.

(12-12-83)